


ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి)/ క్రైమ్: జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన కాకినాడ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా సీహెచ్.తిరుపతినాయుడును తన మాతృ సంస్థ ఎక్సైజ్ శాఖకు జిల్లా అధికారిగా నియమించారు. ఇప్పటివరకు జిల్లాలో ఎచ్చెర్ల కేంద్రంగా ఉన్న బాట్లింగ్ డిపో మేనేజర్‌గా, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన బి.సుబ్బారావును డీఎంగా నియమిస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రభుత్వం సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన విషయం తెలిసిందే.



కుందువానిపేట వద్ద సముద్ర తీరంలో అలజడి

ఎగసిపడుతున్న అలలు

శ్రీకాకుళం క్రైం: తుఫాన్ ప్రభావంతో జిల్లా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా మారింది. పలుచోట్ల జల్లులు కురిశాయి. కుందువానిపేట, పెద్దగనగళ్లవానిపేట సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. కుందువానిపేట గ్రామంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించారు. సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు.



ఇప్పిలిలో పురాతన శిలాశాసనం

● క్రీస్తుశకం 1137 నాటిదిగా గుర్తింపు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని ఇప్పిలి గ్రామంలో బుధవారం పురాతన శిలాశాసనం బయల్పడింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పర్యాటకాధికారి కె.నారాయణరావు అక్కడకు చేరుకున్నారు. ఈ వివరాలను పురావస్తుశాఖ అధికారులకు అందజేశారు. కళింగ రాజ్యాన్ని 63 ఏళ్ల నిరాటంకంగా పరిపాలించిన తూర్పుగంగ చక్రవర్తి చోడగంగదేవుని కాలానికి సంబంధించిన కొత్త తెలుగు శిలాశాసనంగా గుర్తించారు. ఇప్పిలిలో ఉన్న కరుంజేశ్వర స్వామి ఆలయంలో అఖండ దీపం వెలిగించడానికి కావాల్సిన నెయ్యి కోసం స్థానిక రేవినాయకుడు, 9 మాడల నగదును (అప్పుడు చెలామణిలో ఉన్న నాణేలు) దానం చేసిన సందర్భంగా క్రీస్తు శకం 1137 ఆగస్టు 17న బుధవారం ఈ శాసనం వేసినట్లు తెలుస్తుందని కేంద్ర పురావస్తుశాఖ శాసనవిభాగ సంచాలకుడు కె.మునిరత్నం రెడ్డి తెలిపారు. ఇప్పిలి చారిత్రక ప్రాధాన్యత కలిగిన గ్రామమని, ఆ గ్రామంలో కరుంజేశ్వర (శివునికి అంకితమైన) ఒక దేవాలయం ఉండేదని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. ప్రస్తుతం ఆ దేవాలయం రూపురేఖలు మారి ఆధునీకరించబడిందని, అప్పటి శిల్పాలు ఇప్పటికీ అలనాటి చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలి ఉన్నాయని చెప్పారు. వాటిని కాపాడుకుని భవిష్యత్తరాలకు అందించాలని గ్రామస్థులు, జిల్లా యంత్రాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

సముద్రంలో బోటుబోల్తా

● మత్స్యకారుడి గల్లంతు ● క్షేమంగా ఒడ్డుకు చేరిన ముగ్గురు



గల్లంతైన అప్పన్న

సోంపేట, సెప్టెంబరు 25: సముద్రంలో బోటు బోల్తాపడిన ఘటనలో ఓ మత్స్యకారుడు గల్లంతు కాగా, మరో ముగ్గురు ఈదుకుంటూ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటన బారువ కొత్తూరు తీరంలో బుధవారం చోటుచేసుకుంది. బారువ కొత్తూరు గ్రామానికి రట్టి అప్పన్న(47), లండ మాధవరావు, ఎర్ర మోహనరావు, రెట్టి వెంకటేష్ కలసి బుధవారం వేకువ జామున 5.30గంటల సమయంలో చేపల వేటకు బోటుపై సముద్రంలోకి వెళ్లారు. వేట అనంతరం తిరిగి వస్తుండగా అలల ఉధృతికి బోటు బోల్తాపడింది. దీంతో నలుగురూ చెల్లాచెదురుగా సముద్రంలోకి పడిపోయారు. అయితే అప్పన్న గల్లంతు కావడంతో మిగిలిన మత్స్యకారులు కొద్దిసేపు సముద్రంలో వెతికినప్పటికీ ఆయన ఆచూకీ దొరకలేదు. దీంతో వారు ఈదుకుంటూ ఒడ్డుకు క్షేమంగా చేరుకున్నారు. అప్పన్న కోసం గ్రామస్థులు గాలిస్తున్నారు.



ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు

ఎండబెట్టి.. కేక్‌లా చేసి..

● అక్రమంగా గంజాయి రవాణా ● వేర్వేరు చోట్ల 84 కిలోల స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్టు



పట్టుబడిన గంజాయి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, సెప్టెంబరు 25: ఇచ్ఛాపురం, కాశీబుగ్గ పోలీసు స్టేషన్ల పరిధిలో వేర్వేరు చోట్ల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12 లక్షల విలువైన 84 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పూర్తిగా ఎండబెట్టి కేక్ మాదిరిగా తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వివరాలను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి బుధవారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొదాల గ్రామానికి చెందిన బబ్రు బహన్‌స్వైన్ వివిధ ప్రాంతాల్లో పనిచేసినా ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో అప్పులపాలయ్యాడు. ఈయన అక్క కుమారులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ రెండుచేతులా సంపాదిస్తుండడంతో బహన్‌స్వైన్ కూడా ఇందులోకి వచ్చాడు. వీరికి మహారాష్ట్ర నాసిక్ జిల్లా ఆనంద్‌వల్లి గ్రామానికి చెందిన లలితప్రదీప్‌ఖైర్నర్ అనే మహిళ పరిచయమైంది. బహన్‌స్వైన్, లలితప్రదీప్ కలసి అనేకమార్లు సూరత్‌కు గంజాయి రవాణా చేశారు. బుధవారం వీరిద్దరూ ఇచ్ఛాపురం జాతీయరహదారి తులసమ్మ ఆలయం వద్ద 82.2 కిలోల గంజాయి బ్యాగులు పట్టుకొని ఉన్నారు. వీరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

● ఒడిశా రాష్ట్రం కేంద్రపడ జిల్లా రాజానగర్‌కు చెందిన త్రిలోచన్‌సామంతరాయ్ బైక్‌పై 1.8 కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పలాస బైపాస్ రోడ్డు మొగిలిపాడు గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ ద్విచక్ర వాహనాన్ని తన ఇద్దరు స్నేహితులతో కలసి భువనేశ్వర్‌లో దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. త్రిలోచన్‌ను అరెస్టు చేసి గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ(క్రైమ్) పి.శ్రీనివాసరావు, సీఐలు డి.మోహనరావు, రూరల్ ఎస్ఐ డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మారిన ప్యాకింగ్..

ఇప్పటి వరకూ గంజాయి ముఠా గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి దానిపై ప్లాస్టర్‌చుట్టి రవాణా చేసేవారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం, కాశీబుగ్గలో పట్టుబడిన గంజాయి ప్యాక్‌ను మార్చడం సర్వత్రా పోలీసుల్లో ఆందోళన కలిగిస్తోంది. గంజాయిని పూర్తిగా ఎండబెట్టి కేక్ మాదిరిగా తయారు చేశారు. దీన్ని సంచుల్లో ప్యాకింగ్ చేసి రవాణా చేస్తున్నారు. దీన్ని పరిశీలిస్తేనే తప్పా గంజాయి అన్న అనుమానం ఎవరికీ రాదు. రంపం పొట్టు, కర్రపొట్టుగా నమ్మిస్తూ రవాణా చేస్తున్న విషయాన్ని పోలీసులు పసిగట్టడంతో గుట్టు రట్టయింది.

ఏడాదిలో 490 కిలోలు సీజ్..

ఈ ఏడాది జిల్లాలో ఇప్పటి వరకు 490 కిలోల గంజాయిని సీజ్ చేసి 70 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గత 20 రోజుల్లో 12 గంజాయి కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్టు చేసి 230 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తాగుతూ పట్టుబడిన 17 మందిని డి ఎడిక్షన్ సెంటరుకు తరలించామన్నారు. జిల్లాలో గంజాయి అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. గంజాయి తాగే వారు దాన్ని మానకుంటే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి పంట లేదని, సరిహద్దు రాష్ట్రం ఒడిశా నుంచి అధికమొత్తంలో రవాణా జరుగుతుందని స్పష్టం చేశారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయితో పట్టుబడిన ముద్దాయిలు నేరప్రవృత్తి మానుకోవాలని, సత్ప్రవర్తనతో నడుచుకుంటే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామన్నారు. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో మాట్లాడి ఉమ్మడిగా గంజాయి రవాణాపై దాడులు చేస్తామని ప్రకటించారు.

ఉసురుతీసిన నిర్లక్ష్యం



కృష్ణంరాజు (ఫైల్)

● పాఠశాల సన్‌షేడ్ కూలి విద్యార్థి మృతి

● గాయపడిన మరో విద్యార్థి ● పాతర్లపల్లిలో ఘటన

రణస్థలం, సెప్టెంబరు 25: 'నాడు-నేడు' పనుల నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. ప్రమాదానికి గురైన విద్యార్థిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ఉపాధ్యాయులు జాప్యం చేశారు. తోటి విద్యార్థులే చెక్క బల్లపై అతి కష్టమ్మీద ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు కాపాడలేకపోయారు. ఈ విషాద ఘటన పాతర్లపల్లిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతర్లపల్లి గ్రామానికి చెందిన వనుము కృష్ణంరాజు (15) అనే విద్యార్థి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో తోటి విద్యార్థులతో కలసి నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం సన్‌షేడ్ ఎక్కాడు. దీంతో సన్‌షేడ్ ఒక్కసారిగా కూలిపోయింది. కృష్ణంరాజు సన్‌షేడ్ కింద ఉండిపోయాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థి కోరాడ శ్రీరామ్‌కు గాయాలు అయ్యాయి. తోటి విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు వచ్చి కృష్ణంరాజును బయటకు తీశారు. సపర్యలు చేశారు. అప్పటికే కృష్ణంరాజు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వాహనంలో తరలించే ఏర్పాటు చేయలేదు. తీవ్ర జాప్యం చేశారు. తోటి విద్యార్థులే చెక్క బల్లపై కృష్ణంరాజును పడుకోబెట్టి హైస్కూల్‌కు అర కిలోమీటర్ దూరంలో ఉన్న పాతర్లపల్లి ఆస్పత్రికి తరలించారు. సుమారు అరగంట పాటు జాప్యం జరగడంతో ఆస్పత్రికి వెళ్లేటప్పటికి కృష్ణంరాజు ప్రాణాలు వదిలాడు. పాఠశాల వద్దకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కేవలం ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే తమ పిల్లాడి ప్రాణం తీసిందని మండిపడ్డారు. గత కొంతకాలంగా నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అటువైపుగా వెళ్లిన విద్యార్థులను కట్టడి చేయకపోగా.. గాయపడిన విద్యార్థి విషయంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేరుకున్నారు. విద్యార్థి ఎలా మృతి చెందాడో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల వర్కింగ్ సమయంలో విద్యార్థులు ఎందుకు బయటకు వచ్చారని హెచ్‌ఎంను ప్రశ్నించారు. కృష్ణంరాజును వెంటనే ఎందుకు ఆసుపత్రికి తీసుకెళ్లలేదని నిలదీశారు. మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అధికారులతో పాటు పోలీసులు సముదాయించడంతో ఆందోళనను విరమించారు. కృష్ణం రాజు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడు తండ్రి వనుము కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

రూ.5 లక్షల పరిహారం..

కృష్ణంరాజు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల పరిహారం మంజూరైనట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. విద్యార్థి మృతికి నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. అదేవిధంగా నాడు - నేడు పనుల పూర్తిపై ఎందుకు ఇంత జ్యాప్యం జరిగిందో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మంత్రి అచ్చెన్న దిగ్భ్రాంతి..

శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి)/రణస్థలం: విద్యార్థి కృష్ణంరాజు మృతిపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణంరాజు మృతి తనను కలచి వేసిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల సన్‌షేడ్ కూలడంతోనే ఈ ప్రమాదం జరగడం విచారకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గాయ పడిన మరో విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. 'నాడు నేడు' పనుల్లో నాణ్యతను పరిశీలించాలని, పాఠశాలల్లో శిథిల భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా నియంత్రించాలని డీఈవోను ఆదేశించారు.

ఉపాధి కల్పిస్తాం.. వలసలు నివారిస్తాం



మహిళా లబ్ధిదారుకు హుద్‌హుద్ ఇళ్ల పట్టాను అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న, ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్ పుండ్కర్

● ఏడాదిలో మూలపేట పోర్టు ప్రారంభం

● త్వరలో శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 19: జిల్లాలోని మత్స్యకారులకు ఉపాధి కల్పించి వలసలు నివారిస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వారితో పాటు ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'జిల్లాలో ఉపాధి లేక మత్స్యకారులు వలసలు పోతున్నారు. మూలపేట పోర్టును ఏడాదిలోగా పూర్తి చేసి వారికి ఉపాధి కల్పిస్తాం. తద్వారా వలసలు నివారించవచ్చు. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి దొరుకుతుంది. శ్రీకాకుళంలో కూడా త్వరలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తాం. మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తాం. కుందువానిపేటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. విశాఖ నుంచి మూలపేట పోర్టు వరకు బీచ్ కనెక్టవిటీ రహదారి నిర్మిస్తాం. రోడ్డు వెంబడి ఎంపీ ల్యాడ్స్ నిధులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం. దీపావళి రోజున ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తాం. గత టీడీపీ ప్రభుత్వంలో కుందువానిపేటలో హుద్‌హుద్ ఇళ్లు నిర్మించాం. వాటిని వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించకపోవడం దారుణం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజకీయాలకు తావులేకుండా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. ప్రస్తుతం 66 మందికి పట్టాలు అందించి మిగిలిన 31 మందికి త్వరలో పంపిణీ చేస్తామని' తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు 'ఇది మంచి ప్రభుత్వం' దోహద పడుతుందని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడినప్పటికీ సకాలంలో పింఛన్లు, జీతాలు అందిస్తున్నామన్నారు. త్వరలో మత్స్యకారులకు వలలు, బోట్లు అందించడంతో పాటు ప్లాట్ ఫారంలు నిర్మించి ఇస్తామన్నారు. రూ.320 కోట్లతో డబుల్ రోడ్లు వేయనున్నట్లు చెప్పారు. మత్స్య కారులు కక్షలు, రాజకీయ దాడులు మానుకుని గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుందువానిపేట-పీజీపేట-బలరాంపురం గ్రామాలకు రహదారి నిర్మిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. స్వర్ణాంధ్ర2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే లబ్ధిదారులకు హుద్‌హుద్ ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ నగేష్, తహసీల్దార్ గణపతిరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఈ.రఘు, మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న టీడీపీ నాయకులు సీర రమణ, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, మూకళ్ళ తాతబాబు, జయానంద్, మెండ దాసునాయుడు, గనగళ్లవానిపేట సర్పంచ్ సూరాడ సూర్యం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం

● 7.25 లక్షల మెట్రిక్ టన్నులు

● జిల్లాలో 275 మిల్లుల ద్వారా సేకరణ

(టెక్కలి)

జిల్లాలో ఈ ఏడాది 7.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు సుమారు 4.50లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. పంట కోత దశలో ఎలాంటి విపత్తులు లేకపోతే ఆశాజనకంగా దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. జిల్లాలో 275 మిల్లుల ద్వారా 7.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఇప్పటికే అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గత ఏడాది వర్షాలు అనుకూలించక, ఇతరత్రా సమస్యలు మూలంగా 5.45లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

మార్గదర్శకాలు విడుదల..

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అక్టోబరు 31 నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ధాన్యం విక్రయించిన 48గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమచేస్తామని వెల్లడించారు. సాధారణ రకాలు స్వర్ణ, సంపద స్వర్ణ, కనక్‌ప్లస్, రాణి, 1061, 1064, శ్రీధుతి, జైశ్రీరామ్, తరంగిణి, 1121, 1318 తదితర వాటిని క్వింటా రూ.2,300కు, గ్రేడ్-1 రకాలు సాంబమసూరి, మార్టేరు సాంబ, ఆర్ఎన్ఆర్14850 తదితర వాటిని క్వింటా రూ.2,320కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు, కౌలురైతుల ధాన్యాన్ని మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ-క్రాప్ 80శాతానికి పూర్తయింది. ఈసారి ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌ను కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు. నోడల్ సంస్థలుగా పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌లు వ్యవహరిస్తాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ వెల్లడించడంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



యంత్రంతో ధాన్యం నూరుస్తున్న దృశ్యం (ఫైల్)

నా దృష్టిలో... వేడుక అంటే ఇదే



నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.


నేరస్థుల పాలిట యముడు



'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు

- సీఎం స్టాలిన్ ఉత్తర్వులు



గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్లుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు..

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేష దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేష చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాఠి, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

దిక్సూచి
DIKSUCHI

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.
- వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన


హిరమండలం:కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం కొండరాగోలు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో దగ్గరైం దన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రభుత్వ పథకాలను వివరించారు. స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, నేతలు తూలుగు తిరుపతిరావు, యాళ్ల నాగేశ్వరరావు, లాడె కృష్ణ, గోళ్ల సింహాచలం, చెట్టు శ్రీనివాసరావు, దారపు డిల్లేశ్వరరావు, జి.కామేశ్వరరావు, బర్రి సురేష్, ఎంపీడీవో బి.శైలజ పాల్గొన్నారు.

వంద రోజుల్లో హామీలను నెరవేర్చిన ప్రభుత్వం


పలాస రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బ్రాహ్మణతర్లాలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో వంశధార కాలువల ద్వారా చుక్క నీరివ్వలేకపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే కాలవల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరిచ్చి హామీని నిలబెట్టుకున్నామన్నారు. అలాగే సామాజిక పింఛన్ల మొత్తం పెంపు, డీఎస్సీ ప్రకటన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేశామన్నారు. వరహాలగెడ్డపై వంతెనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పీరికట్ల విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్, ఎంపీడీవో రమేష్‌నాయుడు, నాయకులు వడ్డి యాదగిరి, ఆర్.సుదర్శనరావు, ఆళ్ల వెంకట్రావు, హెచ్.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయం


జలుమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. వెంకటాపురం పంచాయతీ రామచంద్రాపురంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి జె.నాగలక్ష్మి, ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ వెలమల రామారావు, టీడీపీ నాయకులు రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు నిర్వహించాలి: మంత్రి అచ్చెన్న


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో అక్టోబరు ఒకటి నుంచి 3 వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలను అందరి సహకారంతో నిర్వహించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రోడ్డుపై వ్యాపారం చేసే వారికి ప్రత్యేక స్థలం కేటాయించాలన్నారు. రోడ్లను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ ఈవోను ఆదేశించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, దర్శనం, క్యూలైన్లు, నాణ్యమైన ప్రసాదం పంపిణీపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీ అధికారులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు, ఎటువంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై దృష్టి సారించాలని సూచించారు. కొత్తపేట పార్టీ కార్యాలయం నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరవు వరకు బైక్‌పై వెళ్లి జాతర పనులను పరిశీలించారు. వరద బాధితుల కోసం ఏపీఎస్‌డబ్ల్యూసీ విశ్రాంత జనరల్ మేనేజర్ ప్రసాద్ రూ.1.30 లక్షల చెక్కును మంత్రికి అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, కళ్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి పాల్గొన్నారు.

టెక్కలికి మళ్లీ ఉద్యానవన శాఖ కార్యాలయం

టెక్కలి: టెక్కలి డివిజన్ కేంద్రంలోని ఉద్యానవన శాఖ కార్యాలయం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడి నుంచి తరలించగా మరలా మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో టెక్కలిలో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఏప్రిల్ 3న ఇక్కడి కార్యాలయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు తరలించారు. దీంతో గడచిన రెండున్నరేళ్లుగా ఇక్కడి రైతులు ఉద్యాన పంటలపై సరైన సూచనలు, సలహాలు అందుకుని పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన మంత్రి ప్రత్యేక జీవో ద్వారా కార్యాలయాన్ని తిరిగి టెక్కలిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ, అనుబంధ పంట లు, ఉద్యానవన పంటలపై మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమని టీడీపీ నాయకులు, రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

30 ఏళ్ల నరకానికి రూ.2 కోట్లతో మోక్షం

నరసన్నపేట: మండల పరిధి ఉప్పరిపేట, డోలపేట గ్రామాలకు మడపాం నుంచి లుకలాం వరకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణాలకు ఎట్టకేలకు మోక్షం కలుగనుంది. గత నెల 31న 'ఆంధ్రజ్యోతి'లో '30 ఏళ్లుగా నరకం' శీర్షికతో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందించారు. ఈ మేరకు రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు ఉపాధి నిధుల కోసం ప్రతిపాదన చేశారు. ముషిడిగట్టు పంచాయతీ ఉప్పరిపేట, డోలపేట గ్రామాలకు జీడి తోటల్లో రోడ్లు వేసేందుకు రూ.2 కోట్ల అంచనాతో ప్రణాళికను కలెక్టర్‌కు పంపారు. జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండేలా మడపాం నుంచి ఈ మార్గాన్ని చేనులవలస, ఉప్పరిపేట, డోలపేట, అంబాజీపేట, లుకలాంను వరకు నిర్మించనున్నారు. ఈమేరకు వచ్చే నెల 4న జరగనున్న మండల సమావేశంలో ప్రధాన అజెండాగా ఈ అంశాన్ని చర్చించనున్నట్లు ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలి

టెక్కలి: టెక్కలి కోర్టు భవనాల సముదాయ నిర్మాణాలకు పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద కోరారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడున్న భవనాలు వర్షాలు పడినప్పుడు కారుతున్నాయని, దీంతో కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి దివాకర్, ఉపాధ్యక్షుడు ధర్మారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

హిరమండలం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం కొండరాగోలులో 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులను వినియోగించేలా రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఏడీఏ బి.రాజగోపాల్, ఏవో సంధ్య, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కాళీప్రసాద్

హిరమండలం: ఎంపీడీవోగా రఘుపాత్రుని కాళీప్రసాద్ నియమితులయ్యారు. ఎల్ఎన్ పేటలో పనిచేసిన ఆయని ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన బి.శైలజ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. ● సబ్ రిజిస్ట్రార్‌గా బి.అరుణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఆమదాలవలస నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కిల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

మందస/హరిపురం: పిడిమందసలో వేంచేసిన కిల్లమ్మ దేవతకు బుధవారం ఉదయం మందస రాజావారి కోట ఆవరణలో పూజలు చేపట్టారు. వచ్చే నెల 9వరకు కిల్లమ్మకు ప్రత్యేక పూజలను కోటలో చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు శేషమ్మ, జయరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

యూరియా కోసం పాట్లు



వజ్రపుకొత్తూరు: స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వర్షాలు కురవడం, వంశధార కాలువల ద్వారా సాగు నీరందడంతో రైతులు పంటల ను వేసుకున్నారు. వరి పైరుకు యూరియా అవసరం కావడంతో కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఆర్బీకేల్లో అందిస్తున్న యూరియా అందరికీ సరిపోక పోవడంతో పీఏసీఎస్ కార్యాలయానికి క్యూ కడు తున్నారు. పీఏసీఎస్ కార్యాలయానికి ఎరువు లు వచ్చాయని సోమవారం రైతులకు సమాచారం వచ్చింది. అయితే మంగళవారం పంపిణీ చేయలేదు. దీంతో బుధవారం రైతులు ఒక్కసారి కార్యాలయానికి రావడంతో కిటకిటలాడింది. రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు వచ్చి చర్యలు తీసుకున్నారు. దీనిపై పీఏసీఎస్ ఇన్‌చార్జి ఎస్.కృష్ణారావు వద్ద ప్రస్తావించగా నాలుగేళ్ల తరువాత సొసైటీలకు ఎరువులు వచ్చాయని, యూరియాకు డిమాండ్ ఉండడంతో ఎక్కువగా వచ్చారని, పోలీసుల సాయంతో రైతులం దరికీ యూరియా అందించామన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో అసోం ప్రిన్సిపల్ సెక్రటరీ

జలుమూరు: సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామిని అసోం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శంతను గొట్మారే దంపతులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. శేషవస్త్రాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ విశిష్టలను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం



పలాసరూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సాయిశిరీష స్కూల్ యాజమాన్యం రూ.50 వేలు విరాళం అందించింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, రేణుకేశ్వరరావు కలిసి చెక్కుకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు బాసటగా నిలిచేందుకు వచ్చిన వారిని శిరీష అభినందించారు.

గొర్రెల మృత్యువాతతో పెంపకందారుల ఆందోళన

నందిగాం: దిమ్మిడిజోలకు చెందిన గొర్రెలు పెంపకందారుల గొర్రెలు మృత్యువాత పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా ఆవల సూర్య నారాయణ, కృష్ణారావు, తాడేల కృష్ణారావులకు చెందిన సుమారు 60 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కోలి బేసిల్లోసిస్ బ్యాక్టీరియా అనే వ్యాధితో ఇవి మృతి చెందినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎం.రవికృష్ణ తెలిపారు. సూచనలందించినట్లు తెలిపారు. ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మార్చి 31 లోగా గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

పాతపట్నం: ప్రభుత్వం మంజూరుచేసిన గృహనిర్మానాలను వచ్చే ఏడాది మార్చి31లోగా పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి కరుణాకరరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 28న సమావేశం నిర్వహించి నిర్మాణాలు పూర్తి చేయించే దిశలో చర్యలు చేపట్టాలన్నారు.

'కుర్చీని తీసివేయడం తగదు'

వజ్రపుకొత్తూరు: సచివాలయంలో ఉన్న తన కుర్చీని తొలగించారని పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె తన అనుచరులతో కలిసి సచివాలయం వద్ద నిరసన తెలిపారు. సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన కుర్చీని చెత్తబండిలో ఇంటికి పంపారని, దీనిపై ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ విషయమై కార్యదర్శి మధు వద్ద ప్రస్తావించగా సర్పంచ్ భర్త నిబంధనలకు విరుద్ధంగా సచివాలయంలో వేరే కుర్చీ వేసుకొని కూర్చోవడంతో సిబ్బంది విధులకు ఆటంకం కలుగుతుండడంతో ఆ కుర్చీని తొలగించామన్నారు.

పాఠశాల అప్‌గ్రేడేషన్‌పై వివరాల సేకరణ

హిరమండలం: సుభలయ ఆర్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని జడ్పీటీసీ బుచ్చిబాబు, సర్పంచ్ లంక రోజారాణి ఇటీవల కలెక్టర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో టెక్కలి డిప్యూటీ డీఈవో విలియమ్స్ బుధవారం సందర్శించి సదుపాయాల వివరాలు సేకరించారు. నివేదికను డీఈవోకి అందజేస్తామన్నారు. బుచ్చిబాబు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాల్ సేవలు మార్గదర్శకం

పాతపట్నం: పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ నిస్వార్థ సేలు నేటితరానికి మార్గ దర్శకమని బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ జయంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాడేల భూపతి, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' మెటీరియల్ పనులపై వాగ్వాదం

● మండల సమావేశంలో ఎంపీపీ వర్సెస్ ఎంపీటీసీ


వాగ్వాదం చేసుకుంటున్న ఎంపీపీ ఎంపీటీసీలు

జలుమూరు: జాతీయ ఉపాధిహామీ మెటీరియల్ పనుల వివరాల సమాచారం ఎంపీ టీసీలకు తెలియజేయకుండా తీర్మానం ఎలా పెడతారని నగరికటకం ఎంపీటీసీ బగ్గు రామకృష్ణ ప్రశ్నించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి పనుల తీర్మానం ప్రతిపాదనపై రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేయగా ఎంపీపీ గోపీకి ఆయనకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇద్దరూ వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కావడం గమనార్హం. సమావేశంలో అన్ని శాఖలపై సమీక్షించి అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ నిధులతో మండలంలో 26 పనులకు గాను రూ.1.95 కోట్లతో ఆమోదించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సభలో చదివి వినిపించారు. దీనిపై స్పందించిన బగ్గు రామకృష్ణ ఎంపీటీసీలకు సమాచారం లేకుండా అజెండాలో పొందుపర్చకుండా ఎలా ఆమోదించారని నిలదీశారు. ఎంపీడీవో బదులిస్తూ అజెండా రూపొందించిన తరువాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినందున ఈ సమావేశంలో తీర్మానానికి పెట్టామన్నారు. దీనిపై అసంతృప్తి చెందిన రామకృష్ణ అత్యవసర సమావేశం నిర్వహించి చర్చించాలి కదా అని ప్రశ్నించారు. దీంతో ఎంపీపీ గోపి కలుగజేసుకొని ఉపాధి మెటీరియల్ పనులు ఆమోదానికి సమయం లేనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీటీసీలకు సమాచారం అందించి ఆమోదించామన్నారు. దీంతో సభ్యులు విస్తుపోయేలా వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే రమణమూర్తి కలుగజేసుకొని సర్దిచెప్పారు. సభ గౌరవ మర్యాదలు కాపాడాల్సిన బాధ్యత సభ్యులపై ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కలిసి పనిచేసి ప్రజల అవసరాలు తీర్చేందుకు పనిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా పూజలు

మందస/కోటబొమ్మాళి: టీటీడీలో లడ్డూలో నెయ్యి కల్తీపై నిరసనగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మందస, కోటబొమ్మాళిల్లో జనసేన పార్టీ నేతలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మందస వాసుదేవుని ఆలయం, కోటబొమ్మాళి మండలం గుంజిలోవ గ్రామంలో శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పలాస, టెక్కలి ఇన్‌చార్జిలు డా.దుర్గారావు, టెక్కలి జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. లడ్డూ కల్తీలో మాజీ సీఎం జగన్ చేసిన తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పూజలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌పండా, జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు, ఆ పార్టీ నేతలు గోపాలరావు, కె.కృష్ణారావు, వంశీకృష్ణ చౌదరి, సురేష్, గేదేల శ్రీను, ఇలపండు రమేష్, గేదేల త్రినాథ్, గంగ అశోక్, తాడేన విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


మందస, కోటబొమ్మాళి మండలాల్లో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

సమయపాలన పట్టని వైద్యులు

● ఇబ్బందుల్లో రోగులు


వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

టెక్కలి: స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులు సమయపాలన పాటిం చడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉదయం 9 గంటలకే వైద్యులు ఫేస్ రికగ్నిషన్ సిస్టంలో హాజరు వేయా లని ఇటీవల జిల్లా కేంద్ర ఆసుపత్రిని పరిశీలించిన హెల్త్ డైరెక్టర్ అట్టాడ సిరి ఆదేశించడం, అనేక పర్యాయాలు ఆసుపత్రి సందర్శనలో వైద్యుల నిర్లక్ష్యంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితిలో ఎటువంటి మార్పు రావడం లేదు. బుధవారం ఉదయం ఆసుపత్రిలో 9.45 గంటలకు కూడా ఆర్థోపెడిక్ వైద్యులు రాకపోవడంతో రోగులు నిరీక్షించాల్సి వచ్చింది. ఎప్పటికీ వైద్యులు రాకపోవడంతో రోగులు ఆరా తీయగా ఇద్దరు ఆర్థోపెడిక్ వైద్యులు రాలేదని గుర్తించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మహరాజ్ 10 గంటల తరువాత మరో వైద్యుడ్ని పంపించారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా తనకు రణస్థలం సీహెచ్‌సీలో అదనపు డ్యూటీ వేయడంతో వెళ్లానని, మరో ఆర్థోపెడిక్ వైద్యుడు సెలవు పెట్టి ఉంటారని తెలిపారు.

భూ సర్వేలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

కొత్తూరు: భూముల రీ సర్వేలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాకు దిగారు. అనంతరం తహసీల్దార్ బి.పాపారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్, రైతు నాయకులు పెదకోట యతిరాజు, గేదెల కృష్ణారావు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ కన్నంనాయుడు, పి.వెంకట కృష్ణ, చోడవరపు లోకేష్, పొగిరి రవి మాట్లాడుతూ భూముల రీ సర్వేలో నష్టపోయిన రైతు లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, కె.సురేష్‌నాయుడు, చోడవరపు శంకర్, పి.సాయి, సింహాచలం, వెంకటరమణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంజీ క్రికెట్ పోటీలకు విజయ్



టెక్కలి: టెక్కలికి చెందిన త్రిపురాన విజయ్ ఆంధ్రా క్రికెట్ జట్టు తరపున రంజీ జట్టుకు ఎంపికైనట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు నుంచి బుధవారం సమాచారం అందింది. గురువారం నుంచి అనంతపురంలో ఏసీఏ ఆధ్వర్యంలో జరిగే శిక్షణకు హాజరు కావాలని ఆయన లేఖలో సూచించారు. విజయ్ గత ఏడాది విజయ్ హజేరా ట్రోఫీ పోటీలో, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్ర ప్రదేశ్ జట్టులో ప్రాతినిధ్యం వహించాడు అలాగే ఆంధ్రా సీనియర్స్ జట్టులో స్థానం పొంది అంతరాష్ట్ర క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. గత ఏడాది ఐపీఎల్‌కు సంబంధించి ముంబై, పంజాబ్ కింగ్ లెవెన్స్ ఫ్రాంచేజ్‌లు విజయ్‌ను ట్రైల్‌కు పిలిచారు. విజయ్ తండ్రి కృష్ణమరాజు సమా చారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం టెక్కలిలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విజయ్ రైట్ ఆర్మ్ ఆఫ్‌స్పిన్నర్‌గా రాణిస్తుండడం విశేషం.

భూములిచ్చిన రైతులను ఆదుకోండి

పలాసరూరల్: రామకృష్ణాపురం, బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో టిడ్కో, ఆర్ఆర్ కాలనీ లేఅవుట్‌కు భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలని బొడ్డపాడుకు చెందిన రైతులు ఆర్డీవో భరత్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. నాటి శ్రీకాకుళం జిల్లా సాయుధ పోరాటం అనంతరం అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో హింసకు గురైన పేదలకు రావిటి, డీపట్టా భూములను అందజేశారని, 50 ఏళ్ల తరువాత ప్రజల అవసరం నిమిత్తం మరలా వాటిని ప్రభుత్వం తీసుకోవడంతో రైతులు రోడ్డున పడ్డారన్నారు. బొడ్డపాడుకు చెందిన ఎంఐజీ లేఅవుట్‌లో భూములు కోల్పోయిన రైతులందరికీ ఇళ్ల స్థలాలను అందించాలని కోరారు. టిడ్కో ఇళ్ల స్థలంలో 20 ఎకరాలకు, ఆర్ఆర్ కాలనీకి తీసుకున్న 50 ఎకరాలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలని కోరారు. సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లిన వారిలో సర్పంచ్ టి.మదన్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.పాపారావు, మాజీ సర్పంచ్ సుధారక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.రామారావు, బాధితులు మల్లేశ్వరరావు, అప్పారావు తదితరులున్నారు.

పలాస విద్యుత్ శాఖలో బదిలీలు

పలాస: పలాస విద్యుత్ సబ్ డివిజన్ విభాగంలో బదిలీలు జరిగాయి. పలాస లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.లింగరాజు, గార రాజారావు కంచిలికి బదిలీ అయ్యారు. కాశీబుగ్గ లైన్ ఇన్‌స్పెక్టర్ కొమ్మల గిరీశ్వరరావుకు హరిపురం బదిలీ అయింది. పలాస అసిస్టెంట్ లైన్‌మెన్‌గా గొజ్జ లక్ష్మీకాంత్‌ను నియమించగా ఇక్కడ పనిచేసిన రట్టి అనిల్‌కు లక్ష్మీపురం బదిలీ అయింది. పలాస విద్యుత్ సమస్యలపై లైన్‌ఇన్ స్పెక్టర్ 94141 98238, లైన్‌మన్ ప్రభాకరరావు 93980 10984 నెంబర్లలో సంప్రదించాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

సంతబొమ్మాళి: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని, ఇదే ఉద్దేశంతో చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు అన్నారు. బుధవారం బోరుభద్ర జడ్పీ హైస్కూల్‌లో చెకుముకి సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, మండల కన్వీనర్ లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే డీజీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధ వారం చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, జేవీవీ రాష్ట్ర ప్రతినిధి గొంటి గిరిధర్, జిల్లా ప్రతినిధులు కుప్పిలి కామేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొ న్నారు. ● **నరసన్నపేట:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. మండలంలో 12 పాఠశాలల నుంచి 2100 మంది విద్యా ర్థులు ఈ పరీక్షలు రాసినట్లు జేవీవీ మండల కన్వీనర్ సాయిశ్రీనివాసశర్మ తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన మండలస్థాయి పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ● **హరిపురం:** చెకుముకి పరీక్షలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందని హెచ్ఎం ఎల్ సాంబమూర్తి అన్నారు. హరిపురం హైస్కూల్‌లో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రధర్, రమణబాబు, తేజేశ్వరరావు, కోదండ రావు, శేషగిరి, స్వప్న, రేణుక తదితరులు పాల్గొన్నారు. ● **కోటబొమ్మాళి:** కోటబొమ్మాళి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డి.గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర పరిశీలకుడు మురళీధర్, జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. ఉపాధ్యక్షుడు ఎస్.సంజీవరావు, ఆనందరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రణస్థలం: జాతీయరహదారి దన్నానపేట సమీపాన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెలివాడ గ్రామానికి చెందిన ఎందువ సింహాచలం(48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం నుంచి నెలివాడ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సింహాచలం ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. సింహాచలానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, భార్య నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


వెంకటరావు (ఫైల్)

లావేరు: అప్పాపురం గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటరావు (40) ఈ ఏడాది ఆగస్టు 17 నుంచి కనిపించడం లేదని అతడి భార్య నర్సమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ రామారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వెంకటరావుకు మద్యం తాగే అలవాటు ఉంది. కొన్నిసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్తే రెండు నెలల వ్యవధిలో తిరిగి వచ్చేసేవాడు. ఈసారి బయటకు వెళ్లి వెంకటరావు తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య నర్సమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు.

మంచినీళ్లు అడిగి..

- మహిళ మెడలోని బంగారు ఆభరణాలు చోరీ
- పట్టపగలే దొంగతనం.. ఆందోళనలో సోంపేట ప్రజలు


ఆభరణాలు పోగొట్టుకున్న మహిళ

సోంపేట: మంచినీళ్లు తాగుతానని ఓ మహిళను అడిగి.. ఆమె మెడలోని బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన సోంపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలో పట్టపగలే దొంగతనం జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహాదేవిపేటకు చెందిన గుంటుకు జీవరత్నం తన ఇంట్లో ఉండగా ఉదయం 9.35 గంటల సమయంలో ఓ వ్యక్తి వచ్చి మంచినీళ్లు కావాలని అడిగాడు. ఎవరా అని జీవరత్నం తలుపు తీయగా.. ఆమెను ఒక్కసారిగా వెనక్కి తోసి మెడలో ఉన్న బంగారం పుస్తెలతాడు, నల్లపూసలు తెంపి బండిపై పరారయ్యాడు. అనుకోని ఈ ఘటన నుంచి ఆమె తేరుకుని కేకలువేసి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వారు ఆ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. తప్పించుకొని పోస్టాఫీస్ వీధిగుండా బైక్‌పై పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ హైమావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల కాలంగా పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

పొందూరు: కనిమెట్ట గ్రామంలో బుధవారం తేనెటీగల దాడిలో గ్రామానికి చెందిన వాసుదేవరావు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ శివారులో ఉన్న చెరువు పక్కన ఉన్న పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా సమీపంలో ఉన్న చెట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేశాయి. గాయపడిన వాసుదేవరావును గ్రామస్థులు వెంటనే కింతలి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించడంతో కోలుకుంటున్నాడు.

ఇసుక లారీ సీజ్

ఆమదాలవలస: దూసిపేట జంక్షన్ వద్ద బుధవారం ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆ గ్రామ సమీపంలో నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి లారీలో తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన లారీ ఇసుక లోడ్‌తో రాగా తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలి

అరసవల్లి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో 1, 2 3 ,4, 5, 7 స్థాయీ సంఘ సమావేశాలు ఛైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి కాలువ మరమ్మతులు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి అన్ని ప్రాంతాల రైతులకు సాగునీరు అందించాలన్నారు. శివారు భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులను కోరారు. సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గార ఎస్‌బీఐ కేసులో మరో మలుపు

- ఆర్ఎం రాజుతో సహా 10 మందిని విచారిస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం క్రైం: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార స్టేట్ బ్యాంకులో కుదువపెట్టిన బంగారం మాయమైన కేసులో విచారణ చేపట్టి బాధితులకు వారి ఆభరణాలు అప్పగించినా.. ఎన్నో అనుమానాలు, సందేహాల నడుమ ఈ కేసు ప్రశ్నార్థకంగా మిగిలిపోయి.. సగంలోనే విచారణ నిలిచిపోయిన విషయం అందరికీ తెలిసిందే. గతేడాది నవంబరు 30న గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో తాకట్టులో ఉన్న 62 బ్యాగుల్లో ఉన్న బంగారు ఆభరణాలు మాయమైన ఉదంతంతో ఎస్‌బీఐ ఆర్ఎం రాజు పాత్రపై అటు పోలీసులు, ఇటు బాధితులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎస్పీ రాధిక ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసి, బాధితులకు బంగారు ఆభరణాలు అందజేశారు. అయితే ఈ కేసు విచారణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ నాడు అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ కేసులో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి, ఆ సొమ్మును ఎవరు వాడుకున్నారు? క్యాషియర్‌పై మార్గమధ్యలో దాడి చేసిన కేసులో ఏం జరిగింది? నవంబరు 30వ తేదీ ముందు జరిగిన ఆడిట్‌లో అసలు బంగారు ఆభరణాలు పోలేదంటూ ఎందుకు నివేదిక ఇచ్చారో ఇవన్నీ నేటికీ సమాధానం లేని ప్రశ్నలు గానే మిగిలిపోయాయి. ఈ కేసులో ఆర్ఎం రాజు పాత్ర ఏమిటన్నది ఇప్పటికీ తేలకపోగా, ఓ నిండు ప్రాణం పోవడం బ్యాంకు ఉద్యోగులతో పాటు అటు జిల్లా వాసులను కలచివేసింది. ఆ మహిళా ఉద్యోగి బతికున్నంతవరకు ఆమెపై ఎటువంటి ఆరోపణలు చేయని బ్యాంకు ఉద్యోగులు, ఆమె మరణానంతరం వారి కుటుంబ సభ్యులపై నెట్టడం నాటి విచారణ అధికారులపై అనుమానాలకు తావిస్తోంది. అయితే నాటి ఎస్పీ ఈ కేసు విచారణను కొంతమంది అరెస్టులతో సరిపెట్టినా, బాధిత కుటుంబ సభ్యులు తమకు అన్యాయం జరిగిందని, తమ ఇంట్లోని వ్యక్తిని టార్గెట్ చేసి ప్రాణాలు పోయేందుకు బ్యాంకు ఉద్యోగులే కారణమయ్యారంటూ కొద్ది రోజుల క్రితం సీఎం పేషీతో పాటు జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీగా పనిచేసిన రాధిక బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విచారణ పూర్తి కాకుండానే నిలిచిపోయిన ఈ కేసును పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీంతో శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఈ కేసును విచారణను చేపట్టారు. ఇందులో భాగంగానే బుధవారం శ్రీకాకుళం ఎస్‌బీఐ ఆర్ఎంగా నాడు పనిచేసిన రాజుతో పాటు బంగారం పోయిన వెంటనే బదిలీ అయిన ఉద్యోగులు బ్యాంక్ మేనేజర్ రాధాకృష్ణ, చంద్రశేఖర్‌తో పాటు నలుగురు బ్యాంకు ఆడిట్ ఉద్యోగులు, నాటి క్యాషియర్ సురేష్‌ను పోలీసులు విచారిస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో దేవదాయశాఖ ఆర్‌జేసీ


స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆర్‌జేసీ కె.సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో రమేష్‌బాబు అందజేశారు. ఏసీ బీఆర్‌వీవీ ప్రసాదరావు పట్నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

- **గార:** కూర్మనాథుని బుధవారం దేవాదాయ శాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు దంపతులు (రాజమండ్రి) దర్శించుకున్నారు. స్వామి వారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు అందచేశారు. ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు ఇతర అర్చక స్వాములు పాల్గొన్నారు.
- **జలుమూరు:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామిని దేవదాయ శాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు దంపతులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికను అందచేశారు.


సోంపేట: పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్


ఎచ్చెర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

వంద రోజుల్లో ఎంతో ప్రగతి

- ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఎంతో ప్రగతి సాధించిందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ధర్మవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే పొన్నాడ గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ కె.త్రినాథస్వామి, ఏడీ బి.రజని, ఏవో వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం: ఎమ్మెల్యే అశోక్

సోంపేట: మాకన్నపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, వ్యసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, ఏడీ కె.జగన్మోహనరావు, ఏవో బి.నర్సింహమూర్తి, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, జోగారావు పాల్గొన్నారు.


ఆదివారంపేటలో అవగాహన కల్పిస్తున్న కూటమి నేతలు

తెలుగు భాష విశిష్టతను కాపాడుకుందాం

- పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: సనాతన ధర్మాన్ని, తెలుగు భాష విశిష్టతను కాపాడడం అందరి బాధ్యత అని మాజీ ఎంపీ, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శతజయంత్యుత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత దేశంలో అంతటి ఖ్యాతి గాంచిన వ్యక్తి సచ్చిదానందమూర్తి అని అన్నారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. సచ్చిదానందమూర్తి 14 ఏళ్ల వయసులోనే శ్రీ సంగమేశ్వర అష్టకం మొదలు తన జీవిత కాలంలో 35 తాత్విక గ్రంథాలను తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రచించిన త్రిభాషా కోవిదుడని కొనియాడారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, అధ్యాపకులు పాల్గొన్నారు. వర్సిటీ ఆంగ్ల విభాగం అధ్యాపకుడు పి.రవికుమార్ రాసిన ఎలిమెంట్స్ ఆఫ్ లిటరరీ థియరీ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు విమర్శించారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద బుధవారం పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అభివృద్ధి చేశామంటూ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలు అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి వాటి అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదంపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి గాదం వెంకట్ త్రినాథ్, ఈశ్వరి, రెళ్ల సురేష్, మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. బుధవారం తోటాడ, అక్కివరం పంచాయతీలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలనలో భాగంగా ఇది మా మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, పేడాడ రామ్మోహన్‌రావు, తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, బెండి రామ్మోహన్, హనుమంతు బాలకృష్ణ, తాండ్ర హరిబాబు, గురుగుబెల్లి నీలారావు, కంచరాన లోకేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సిక్కోలే లక్ష్యం


కవర్ల వాడకాన్ని నిలిపివేయాలని సూచిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం అర్బన్: ప్లాస్టిక్ రహిత సిక్కోలే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ సహకారం అందించాలని నగరపాలక కమిషనర్ ఎ.ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో బుధవారం ఆకస్మికంగా కమిషనర్ తనిఖీలు చేపట్టి టిఫిన్ బాక్స్ ఛాలెంజ్ నిర్వహించారు. వినియోగదారులు తమతో పాటు గోనె బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు తీసుకుని వచ్చి విక్రయాలు చేపట్టిన వారిని గుర్తించి వారు కొనుగోలు చేసిన సామగ్రికి కిలోకి రూ.10 తగ్గించేలా చూశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారులను, వారి గోదాములను కమిషనర్ గుర్తించారు. ఇకపై ప్లాటిక్ కవర్లు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. హెల్త్ ఆఫీసర్ డా.సుధీర్‌కుమార్, శానిటేషన్ విభాగ సూపర్ వైజర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులదే ముఖ్యపాత్ర



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం

అరసవల్లి: ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులదే ముఖ్యపాత్ర అని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవి వెంకటాచలం అన్నారు. నగరంలోని రిమ్స్ కళాశాల ప్రాంగణంలో జోన్-1 అధ్యక్షుడు ఆర్.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే నిర్వహించారు. డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, లెక్చరర్ ఇన్ ఫార్మసీ బీవీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఆర్.ప్రశాంత్, ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, రిమ్స్ ఆర్ఎంవో సుభాషిణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్, ఉత్తరాంధ్ర నుంచి ఫార్మసీ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

- **ఎచ్చెర్ల:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని శ్రీకాకుళం అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ ఎం.చంద్రరావు అన్నారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గుజరాతీపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఫార్మసీ ఆఫీసర్ యు.రామరాజు మాట్లాడుతూ దేశంలో ఫార్మసిస్టుల కొరత ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు, ఫార్మసీ విభాగాధిపతి ఆర్డీఎల్వీ క్రిస్టియన్ పాల్గొన్నారు.

శ్రీకూర్మ క్షేత్రంలో సంఘీభావ దీక్ష


దీక్షలో కూర్చొన్న జనసేన పార్టీ నాయకులు

గార: తిరుమల లడ్డూ ప్రసాదంలో చోటు చేసుకున్న తప్పిదాలు నేపథ్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్తం దీక్షకు సంఘీభావంగా శ్రీకూర్మం క్షేత్రంలో బుధవారం ఉదయం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు భూపతి అర్జున్ కుమార్, వారాది వరలక్ష్మి, మెట్ట వైకుంఠరావు, వి.సురేష్, శ్రీరాం, మోహనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాకు చెందిన ఐదుగురు వెయిట్ లిఫ్టర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాలకొండకు చెందిన జి.సునీల్ 102 కిలోల కేటగిరిలో, పెద్దపాడుకు చెందిన ఎం.తరుణ్ 81 కిలోల కేటగిరిలో, పెద్దపాడుకు చెందిన డి.హేమశ్రీ 55 కేటగిరిలో, జి.వర్షిత (ఆడవరం), జి.లలిత (పాలకొండ) సత్తాచాటి హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.భాస్కరరావు, కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు, శిక్షకుడు ఐ.అప్పన్న అభినందించారు.

దుర్గాష్టమికి పందిరిరాట మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పలు ఆలయాల్లో దుర్గాష్టమి శరన్నవరాత్రి మహోత్సవాలు పరందిరిరాటతో ప్రారంభమయ్యాయి. మొండేటివారి వీధిలోని లక్ష్మీగణపతి ఆలయం ప్రాంగణంలో గల లలితా దేవి ఆలయం వద్ద బుధవారం పందిరిరాట వేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి అమ్మవారి అవతారాలు అలంకరణలు చేపట్టనున్నారు. నానుబాల వారి వీధిలోని విజయదుర్గ ఆలయంలో, బాకర్ సాహెబ్‌పేటలోని దుర్గాదేవి ఆలయంలో, నక్క వీధిలో ఉన్న ఉమాజఠశేశ్వరాలయంలో ఉమాదేవికి, మహాలక్ష్మి నగర్ కోలనీలో మండలేశ్వరుని ఆలయంలో ఉన్న కాత్యాయని దేవి, సంతోషిమాత కోవెలలో సంతోషిమాత అమ్మవార్లకు దుర్గాష్టమి శరన్నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- **సోంపేట:** కొర్లాం మెయిన్‌రోడ్డులో నిర్వహించనున్న దుర్గాపూజలకు బుధవారం శుభరాట వేశారు. కొర్లాం గ్రామ ప్రజలు, వర్తకులు, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పూర్ణచంద్ర పాణిగ్రాహి మంత్రోచ్ఛరణలతో శుభరాట వేశారు. జానకిరావు, సంగారు ఢిల్లేశ్వరరావు, పెద్దింటి జోగారావుతదితరులు ఉన్నారు.

అలరించిన స్వరనీరాజనం

శ్రీకాకుళం కల్చరల్: నేపథ్య గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఆపరేషన్ కళామందిర్ గాయకులు కాళ్లకూరి మధుకుమార్, సాయిబాబా ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో బుధవారం బాలు స్వరనీరాజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయకులు మధుకుమార్, బాబూరావు, రాజామోహన్, మార్గదర్శి శ్రీను, బాలు, హరి ప్రసాద్, ఉమా, హరిత, జోత్స్న, మహేశ్వరీ తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమం గురువారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, కె.ఎల్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బెదిరింపులు సరికాదు

అరసవల్లి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత కొంతమంది అధికారులు టైర్లు, స్ప్రింగ్ ప్లేట్లు, గ్లాస్ లీకేజీ, బస్సు డ్యామేజీల పేరిట ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేస్తుండడం సరికాదని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఇటువంటి బెదిరింపుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. డబ్బులు కడితేనే డ్యూటీలు వేస్తామని, లేకుంటే చార్జిషీట్లు జారీ చేసి, ఫైనల్ ఆర్డర్ ద్వారా జీతాల నుంచి రికవరీ చేస్తుండడం విడనాడాలని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు బుధవారం లేఖ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య పాల్గొన్నారు.

ట్యాలెంట్ టెస్ట్‌కు స్పందన

ఆమదాలవలస: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన లభించిందని వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పరీక్షను ఆయన పరిశీలించారు. ఈ పరీక్షకు 8, 9, 10 తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. పాఠశాల హెచ్ఎం కె.అప్పలరాము,జేవీవీ ప్రాంతీయ కమిటీ కోశాధికారి కూర్మాన షన్ముఖరావు, ఉపాధ్యాయులు పి.మోహన్‌రావు, ఎం.ఉమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనికి అభినందనలు

ఆమదాలవలస: పార్లమెంటరీ వైసీపీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను సరుబుజ్జిలి మండల వైసీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, నాయకులు బెవర మల్లేశ్వరరావు, శివానందబాబు, కొవిలాపు చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన విభి న్న ప్రతిభావంతులు తమకు అవసరమైన ఉపకరణా లతోపాటు ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఏడీ కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఆ కాపీతోపాటు సదరం, కుల, ఆదాయ ధ్రువపత్రాలతోపాటు ఆధార్, తెలుపు రేషన్‌కార్డు, వికలాంగత్వ ఫోటోలు (పాస్‌పోర్టు సైజ్)లతో కార్యాలయంలో అందించాలన్నారు.

- **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జంతు శాస్త్రం (జువాలజీ) బోధించేందుకు అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శంకరరావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెట్‌లో పీజీలో 55శాతం, మార్కులుతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ నెల27 సాయంత్రం 4గంటలలోపు కళాశాలకు దరఖాస్తులు అందజేయాలని 28న ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్పీని కలిసిన కమ్యునికేషన్ ఎస్పీ



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం నార్త్ రీజియన్ (విశాఖ) కమ్యునికేషన్ ఎస్పీ జి.సూర్యకుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు.

బీమాతో చేయూత

లావేరు: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రధానమంత్రి బీమా జీవన్ జ్యోతి యోజన పథకంతో చేయూత నివ్వడం జరుగుతుందని లావేరు బ్యాంకు మేనేజర్ డి.నాగరాజు అన్నారు. బీమా చేయించుకున్న చీపురుపల్లి మండలం గచ్చలవలసకు చెందిన రొంగాలి రాము ఇటీవలన మృతి చెందారు. నామినీ అయిన రోరంగి సింహాచలంకు బుధవారం రూ.2 లక్షల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎస్‌వీ ప్రతాప్ రెడ్డి, బి.సత్యనారాయణ ఉన్నారు.

గొల్లపేట హెచ్ఎంకు మెమో

రణస్థలం: గొల్లపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంపా రమేష్‌కు బుధవారం మెమో జారీ చేసినట్టు ఎంఈవో త్రినాథరావు తెలిపారు. మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించిన బిల్లులు సకాలంలో ఇవ్వనందన మెమో జారీ చేసినట్టు స్పష్టం చేశారు. ఎటువంటి కారణం లేకుండా మెమో జారీ చేయడం పై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఖండిస్తోన్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న అధికారులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రిన్సిపల్ డైరెక్టర్, ల్యాండ్స్ రెవెన్యూ, అస్సాం శాంతను (ఐఏఎస్), ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆడిట్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ సుహాసిని(ఐఏఎస్) బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి స్వామివారి జ్ఞాపికను అందజేశారు,

నిర్మాణం పూర్తి చేయండి


వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: బిర్లంగి తోటూరు గ్రామంలో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు మంగి ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ పీవో నాగరాణికి గ్రామస్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ కంఠం స్థలంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు ఊరిపై సోకుతున్న ఆకు ముడతపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసా పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు వై.సంధ్యారాణి, జ్యోతిబసు సూచించారు. బుధవారం సైలాడలో ఏవో పెట్ట మోహన్‌రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. చిట్టివలస సర్పంచ్ గుజ్జల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

రక్తదాన శిబిరం

ఎచ్చెర్ల: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బుధవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, కళాశాల డైరెక్టర్ శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ తారకరామారావు, ఫార్మా డీ హెచ్‌వోడీ భానోజీరావు, పెంకి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు ఈ నెల 23వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సీహెచ్ పల్లవి, సాయి తారక్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు అభినందించారు.

ఘనంగా దీన్‌దయాల్ జయంతి

జి.సిగడాం: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాల్ ఉపాధ్యాయ ఒకశక్తి అని బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో దీన్‌దయాల్ జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పొగిరి దాశరధి, గౌరినాయుడు, పొగిరి సూర్యారావు, అప్పారావు ఉన్నారు.

- **ఇచ్ఛాపురం:** పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి పట్టణ బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మి ఆధ్వర్యంలో బిర్లంగి తోటూరు గ్రామంలో, జిల్లా బీజేపీ కార్యదర్శి వి.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో గల వీకేపీ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దినసరి ఉద్యోగుల వేతనాలపై విచారణ

అరసవల్లి: ఆదిత్యాలయంలో పనిచేస్తున్న 48 మంది దినసరి వేతనదారులకు గత ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోవడంతో బుధవారం ఆలయాన్ని సందర్శించిన దేవదాయశాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు వారితో సమావేశం నిర్వహించి వివరాలు సేకరించారు. విభాగాల వారీగా వివరాలను రాతపూర్వకంగా అందజేయాలని, త్వరలోనే వేతనాలు విడుదల అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. ఈవో రమేష్‌బాబు, జిల్లా దేవాదాయశాఖ అధికారి ప్రసద్ పట్నాయక్, దినసరి ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి

రణస్థలం: విద్యార్థి దశనుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం క్రీడా జోనల్ మీట్ పైడిభీమవరం హైస్కూల్లో క్రీడా ప్రాంగణంలో జరిగిన క్రీడా పోటీలను క్రీడాజ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. కూటమి నాయకులు శ్యామలరావు, కనకారావు, రౌతు శ్రీనివాసరావు, పిషిని జగన్నాధంనాయుడు, పిన్నింటి భానూజినాయుడు, ప్రసాద్, వడ్డాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం: స్థానిక సురంగిరాజా మైదానంలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్-14-17 విభాగాల్లో అథ్లెటిక్స్ ఎంపికలు బుధవారం జరిగాయి. రన్నింగ్, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈవో విచారణ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బుధవారం డిప్యూటీ డీఈవో విజయకుమారి విచారణ చేపట్టారు. పాఠశాలపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో నిర్మించిన క్రీడామైదానం(వాలీబాల్ కోర్టు)లో జరిగిన అవకతవకలపై ఇటీవల పత్రికలలో కథనం ప్రచురితమైంది. గతంలో పాఠశాలలో విద్యార్థుల మధ్య కొట్లాట జరిగి పదో తరగతి విద్యార్థి చేయి విరిగింది. దీనిపైనా పాఠశాల హెచ్ఎం ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ విద్యార్థి తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలతో డీవైఈవో విచారణ చేపట్టారు. హెచ్ఎం వెంకటరావు నిర్లక్ష్యంపై డీవైఈవో మండిపడ్డారు. పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనంపైనా కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు డీవైఈవోకు ఫిర్యాదు చేశారు. ఎండీఎం మార్పుపై ఎస్ఎంసీలో తీర్మానం చేయడం జరిగిందని, త్రీమెన్ కమిటీ నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు పంపించామని విజయకుమారికి, ఎంఈవో-2, హెచ్ఎం తెలిపారు.

అందరూ భాగస్వాములు కావాలి

అరసవల్లి: దేశ అభివృద్ధి లక్ష్య సాధనలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటకాధికారి నారాయణరావు అన్నారు. బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం పుష్కరిణి పరిసరాల్లో, అరసవల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కోఆర్డినేటర్ జ్యోతిర్మయి, శర్వాణి విద్యానికేతన్ సిబ్బంది, డి.రమేష్, సిబ్బంది, ఉన్నారు.

బెల్లుపడలో 'పొలం పిలుస్తోంది'

బూర్జ: గుత్తావల్లి, వావాం గ్రామాల్లో రైతు సదస్సులు, పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు, వీపీఏలు కృష్ణ, శ్రీను, గౌతమి, వావాం సర్పంచ్ మంజు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

కంచిలి: ఎంఎస్ పల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులు బుధవారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. దళేశ్వరం కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను విద్యార్థులు సందర్శించారు. సోలార్ పవర్ ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.